## క్లుప్తంగా

### హాస్టల్‌కు ఎల్ఈడీ టీవీ వితరణ



హాస్టల్‌కు ఎల్ఈడీ టీవీని అందిస్తున్న డాక్టర్ శరణ్యారెడ్డి, తదితరులు

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని నగరిగుట్ట హాస్టల్‌కు బుధవారం దాతలు ఎల్ఈడీ టీవీని వితరణగా అందించారు. డాక్టర్స్ నవీన్, శరణ్యారెడ్డిల కుమార్తె నవీష పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థుల సమక్షంలో పుట్టిన రోజు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు వసతి గృహానికి 43 ఇంచుల ఎల్ఈడీ టీవీని అందించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి రామాంజనేయులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

### నేడు ఎమ్మెల్యే చెన్నూరు రాక

**చెన్నూరు :** చెన్నూరు పాత రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మండల వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం చెన్నూరుకు రానున్నట్లు పార్టీ మండల నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### సింహాద్రిపురం ఎంఈఓగా శ్రీనివాసులరెడ్డి



**సింహాద్రిపురం :** మండల ఎంఈఓగా శ్రీనివాసులరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పులివెందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేస్తూ సింహాద్రిపురం మండల ఎంఈఓగా పదోన్నతిపై వచ్చారు.

### చర్చిలకు భద్రత కల్పించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఎస్ఐ క్యాంబెల్ సిబ్బంది

**జమ్మలమడుగు :** దేశంలో క్రైస్తవ చర్చిలకు కేంద్ర ప్రభుత్వంతోపాటు ఆయా రాష్ట్రాలు భద్రత కల్పించాలని సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏ.ఆగస్టీన్ రాజ్ కోరారు. బుధవారం స్థానిక సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి సిబ్బంది మణిపూర్‌లో జరిగిన సంఘటనలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి వద్దనుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌లో హింసాకాండను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

### మణిపూర్ ఘటనపై నిరసన

**ఎర్రగుంట్ల :** మణిపూర్ రాష్ట్రంలో జరిగిన సంఘటనలపై సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో రెండున్నర నెలలుగా జరుగుతున్న హింసకాండను కేంద్ర ప్రభుత్వం ఆపాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

### రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజీల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### పాఠశాల అభివృద్ధికి విరాళం

**వేంపల్లె :** స్థానిక తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాభివృద్ధికి వేంపల్లె ఎంఈఓ బండి వీరారెడ్డి రూ.30వేల విరాళాన్ని అందించారు. బుధవారం ఆ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రాజశేఖర్‌కు ఈ నగదును అందించారు. ఇటీవల ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాలు చేపట్టడంతోపాటు క్రీడా మైదానంలో ఎగుడు దిగుడులు ఏర్పడ్డాయని.. దీంతో పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. కబడ్డీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, వాకింగ్, ఎక్సర్‌సైజ్ బార్లను ఏర్పాటు చేసేందుకు ఈ నగదును వాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీలోకి 20 కుటుంబాలు చేరిక



వెల్లటూరులో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

**పెండ్లిమర్రి :** మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పోతు సాంబశివారెడ్డి, పోతు శ్రీనువాసులురెడ్డి మరో ఇరవై కుటుంబాలు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్ష్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి అహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సాంబశివారెడ్డి, శ్రీనువాసులురెడ్డి, నితేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, చెంద్రాయుడు, చంటి రాజు, మల్లయ్య మరి కొందరు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, గురివిరెడ్డి, నాగార్జునరెడ్డి, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.





### ద్విచక్రవాహనంలో 80 కిలోమీటర్లు ..

ఇతని పేరు చౌడేశ్వరయ్య. మండల పరిధిలోని గూడెంచెరువులో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గూడెంచెరువులో ఉంటున్న వెంటకసుబ్బమ్మకు వితంతు పెన్షన్ పంపిణీ చేయడం కోసం వలంటీర్ ఇంటికి వెళ్లాడు. అయితే ఆమె అనారోగ్యంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతోందని తెలుసుకుని ఆమెకు పెన్షన్ అందజేసేందుకు తన స్కూటర్‌లో కడప రిమ్స్‌కు 80 కిలోమీటర్ల దూరం వెళ్లి పెన్షన్ అందించాడు. – జమ్మలమడుగు



రిమ్స్‌లో వెంకటసుబ్బమ్మకు పెన్షన్ అందిస్తున్న చౌడేశ్వరయ్య

### అస్పత్రికి వచ్చి పెన్షన్ ఇచ్చాడు..



నాపేరు వెంకటసుబ్బమ్మ, నేను జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువులో నివాసముంటున్నాను. మా వలంటీర్ చౌడేశ్వరయ్య తమకు రావలసిన పెన్షన్‌ను నేను కడప ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే జమ్మలమడుగు నుంచి 80 కిలోమీటర్లు బైక్‌లో వచ్చి ఇచ్చాడు. వలంటీర్ తమకు అన్ని విధాలుగా సాయపడుతూ వుంటాడు. – ఏ.వెంకటసుబ్బమ్మ

### ఒక చేయిలేకున్నా సేవలో..

చక్రాయపేట పంచాయతీలోని యార్లవాండ్లపల్లెలో వలంటీరుగా యమలీల పనిచేస్తోంది. ఈమెకు ఒక చేయి లేదు. ఒంటి చేత్తోనే ఇటు ఇంటి పనులు చేసుకుంటూ వలంటీరుగా తన పరిధిలోని వృద్ధులకు, ఇతరులకు సేవలు చేస్తోంది. అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను అందించి అందరి మన్ననలు పొందుతోంది. –చక్రాయపేట.



వృద్ధురాలికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వలంటీరు యమలీల

### వలంటీర్ లేకుంటే ఇబ్బంది పడేవాళ్లం



నాపేరు పుల్లక్కగారి కొండమ్మ, మాది యార్లవాండ్లపల్లె. మా వలంటీర్ యమలీల లేకుంటే మేము చాలా ఇబ్బందిపడేవాళ్లం. ఆమెకు ఒక చేయి లేకున్నా తెల్లవారక మునుపే వారి ఇంటికి వెళ్లి వృద్ధులకు పింఛన్ అందించేది. మాకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి కావాల్సిన కాగితాలు అన్ని మా వలంటీరే తయారు చేయించి తెచ్చి ఇస్తుంది. – పుల్లక్కగారి కొండమ్మ.

# గండి ఉత్సవ ఏర్పాట్లపై ఎంపీకి వినతి



గండి ఉత్సవాలపై ఎంపీ అవినాష్‌రెడ్డికి వివరిస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి

**చక్రాయపేట :** శ్రావణ మాసం సందర్భంగా గండిక్షేత్రంలో జరగనున్న ఉత్సవాల ఏర్పాట్లపై కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంంత్సరం కూడా టీటీడీ వారిచే భక్తుల సౌకర్యార్థం జర్మన్ షెడ్లు, మొబైల్ టాయిలెట్లు, పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయించేలా సంబంధిత అధికారులకు సిఫారసు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఇందుకు ఎంపీ తక్షణమే టీటీడీ ఈవోకు ఫోన్ ద్వారా సమాచారం అందజేసి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా గండిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా తీసుకోవలసిన చర్యలను కూడా ఆయన వివరించానన్నారు.

### ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మొక్కలు నాటిన ట్రిపుల్ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

**వేంపల్లె :** కాశ్మీర్‌లోని కార్గిల్‌ను దురాక్రమణ చేసిన పాకిస్తాన్ ఆర్మీపై భారత సైన్యం వీరోచిత పోరాటం చేసి విజయం సాధించింది. 1999లో జులై 26న పాక్ సైన్యాన్ని ఓడించి కార్గిల్ భూభాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న సందర్భంగా ప్రతి ఏటా జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా జరుపుకుంటారు. బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–8 ప్రొగ్రాం అధికారి రామసుబ్బయ్య ఆధ్వర్యంలో మెరా మీట్టి.. మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కుమ్మరాంపల్లె మండల పరిషత్ పాఠశాల, గ్రామ సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ మునేష, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దివాస్ యొక్క ప్రాముఖ్యతను భారత సైనికుల ప్రాణ త్యాగాలను గుర్తు చేశారు. అలాగే ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–6 ప్రొగ్రాం అధికారిణి కె.అనుష్ రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామ సచివాలయంలో మొక్కలు నాటారు. సర్పంచ్ చలపతి, సచివాలయ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మట్టి నమూనా పరీక్షలకు అనుగుణంగా

# అరటి పంట సాగుచేయాలి



మాట్లాడుతున్న జాతీయ అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జయభాస్కరన్

**పులివెందుల రూరల్ :** మట్టి నమూనా పరీక్షలకు అనుగుణంగా అరటి పంటను సాగుచేయాలని జాతీయ అరటి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త జయభాస్కరన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో పులివెందుల, వేంపల్లె హెచ్ఓలు రాఘవేంద్రారెడ్డి, రెడ్డయ్యల ఆధ్వర్యంలో అరటి సాగుచేయు విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జాతీయ అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జయభాస్కరన్, ఉద్యాన శాఖ ఏడీ సుభాషిణిలు హాజరై మాట్లాడారు. అరటిలో ఎరువులు, సూక్ష్మ పోషకాలను వాడుకోవాలని, భూమిలో ఉండే పోషకాల ఆధారంగా చేసుకుని ఎరువులు వేసుకుంటూ ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా అరటి పంటను ఎగుమతి చేసి అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చునన్నారు. గ్యాప్ సర్టిఫికేషన్ కొరకు పాటించాల్సిన నియమ నిబంధనలను తెలియజేశారు. అరటిలో సిగటోకా, ఆకు మచ్చ తెగులు నివారణా చర్యలను క్లుప్తంగా వివరించారు. అరటిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో అరటి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుశీల, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ దివ్యాంగుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని దివ్యాంగులకు ఆయన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను ఆయన కట్ చేశారు. అంబకపల్లె రోడ్డులోని ఫిష్ ఆంధ్రలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, కాంతమ్మ, డేనియల్, దాసరి చంద్రమౌళి, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఏపీఎం ఆంజనేయులు, వికలాంగ సంఘ నాయకులు వెంకటసుబ్బయ్య, నాగేశ్వరరెడ్డి, సునీల్, వెంకటరమణ, సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీతో జిలకర మసూరు బియ్యం పంపిణీ

**పులివెందుల టౌన్ :** మార్కెట్‌లో కిలో జిలకర మసూర బియ్యం ధరలు ఆకాశన్నంటుతుండటంతో ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.48లకే కిలో జిలకర మసూర బియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందరావు మోరే తెలిపారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని గర్ల్స్ కళాశాల, సాయి నగర్, సుజాత హాలు దగ్గర కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని.. ఈ కౌంటర్లను గురువారం ఉదయం 10 గంటలకు ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కౌంటర్లలో నేటి నుంచి ప్రతి మనిషికి పది కిలోల చొప్పున జిలకర మసూర బియ్యం పంపిణీ చేస్తామని.. బియ్యం కావాలనుకునేవారు ఆధార్ కార్డు జిరాక్స్‌ను తప్పనిసరిగా తీసుకరావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విద్యార్థుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ రమేష్

**వల్లూరు :** పాఠశాలల్లో విద్యార్థుల రక్షణపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం వుందని జిల్లా నోడల్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. మండలంలోని గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం అందుకు గానూ అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థుల రక్షణ బాధ్యత పూర్తిగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెడ్ టీచర్లదేనన్నారు. చెట్ల కింద, ప్రహరీ గోడలను అనుకుని విద్యార్థులకు తరగతులను నిర్వహించరాదని సూచించారు. విద్యార్థులను అనవసర విషయాల్లో బయటికి పంపరాదన్నారు. నీటి కుంటలు, విద్యుత్ ప్రమాదాలను గురించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో లిల్లెమ్మ, ఎంఈవో–2 విజయ్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

**పిల్లలకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి**

**వీరపునాయునిపల్లె :** ఉపాధ్యాయులు పిల్లలకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని మండల విద్యాశాఖ అధికారి సాధిక్ తెలిపారు. స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఎలా బోధించాలనే దానిపై ఉపాధ్యాయులకు వివరించారు. మండల విద్యాశాఖ అధికారి 2 అనిత మాట్లాడుతూ మధ్యాహ్న బోజనం మెనూ గురించి, ఐరన్ పోలిక్ మాత్రలు ఉపయోగించే విధానం, ఆరోగ్య పరిక్షల గురించి వివరించారు. రక్త హీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి అధనంగా అందించాల్సిన ఫుడ్ గురించి వివరించారు. జగనన్న విద్యా కానుక పంపిణీలో జిల్లాలో మండలం ప్రథమస్థానంలో ఉందని దీనికి కృషి చేసిన ఉపాధ్యాయులందరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని నాలుగు కాంప్లెక్స్‌లకు సంబంధించిన పాధ్యాయులు, మండల రీసోర్స్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**చెన్నూరులో..**

**చెన్నూరు :** ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్, టీచర్ డైరీపై ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన ఏర్పడుతుందని మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి తెలిపారు. బుధవారం రెండవ రోజు కాంప్లెక్స్ సమావేశం మండలస్థాయిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు ఎంఈఓ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి కోర్స్ కోఆర్డినేటర్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండపేట హెడ్మాస్టర్ టీవీ రమణయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సునీత, సీఎంఓ కేశవరెడ్డి, జిల్లా మిస్ కోఆర్డినేటర్ లక్ష్మీనరసింహరాజు, మండలంలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'జగనన్న సురక్ష'లో ధృవీకరణ పత్రాల పంపిణీ

**సింహాద్రిపురం :** మండలంలోని సుంకేసుల సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ గజ్జెల శ్యామాలేదవి పాల్గొని మాట్లాడారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆమె లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రావులకొలను గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ పద్మనాభరెడ్డి, డీటీ వెంకటరెడ్డి, పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఈ-క్రాప్ నమోదు చేయండి



మాట్లాడుతున్న డీటీ త్రిభువన్‌రెడ్డి

**లింగాల :** ఖరీఫ్ పంటలకు ఈ–క్రాప్ నమోదును పారదర్శంగా నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ–క్రాప్ నమోదుపై వీఆర్ఓలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో ఈ–క్రాప్ నమోదు చేయాలన్నారు. ఏఓ రమేష్ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి పొలానికి వెళ్లి రైతు సమక్షంలో ఈ–క్రాప్ నమోదు చేయాలన్నారు. ఈ–క్రాప్ నమోదైన పంటలకు ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, గిట్టుబాటు ధర వంటివి లభిస్తాయన్నారు. దీన్ని గుర్తించి రైతులు సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. సిబ్బంది ఏవైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**కొండాపురం :** ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ క్రాఫ్ పంట నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వి.వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం కొండాపురం రైతు బరోసా కేంద్రంలో మండల తహసీల్దార్ శోభనబాబు, మండల వ్యవసాయ అధికారి ఏవీ రామంజులరెడ్డి, సర్వేయర్లు, ఆర్‌బికే సిబ్బంది, వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుకు ఈ క్రాప్ పంట నమోదు చేసిన తర్వాత రసీదు ఇవ్వాలన్నారు. ఏ పంట వేశారో ఆ రైతుతో ఈకేవైసీ తప్పకుండా చేయించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వ్యవసాయ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా పీర్ల ఉత్సవం



గురిజాలలో పీర్లను ఊరేగిస్తున్న ప్రజలు

**సింహాద్రిపురం :** మండలంలోని గురిజాల, బలపనూరు, లోమడ తదితర గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. బుధవారం ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను చిన్న సరిగెత్తు పురస్కరించుకుని డప్పు వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

# రాష్ట్ర ప్రజలను బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోంది

**జమ్మలమడుగు :** కడప ఉక్కుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసపూరిత వైఖరితో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి శివనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలలో కేంద్ర సహాయ మంత్రి కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని స్పష్టం చేయటంతో తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఉన్నా దాదాపు తొమ్మిది సంవత్సరాల తర్వాత సాధ్యం కాదని చెప్పడం సరైంది కాదన్నారు.

**కడపకు ఉక్కు ఫ్యాక్టరీ నెరవేరే వరకు పోరాటం ఆగదు**

**వేంపల్లె :** కడప జిల్లాలో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు నెరవేరే వరకు పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు తెలిపారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆర్థికంగానూ, సాంకేతికంగానూ సాధ్యం కాదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి నిత్యానంద రోయ్ లోక్‌సభలో ప్రకటించడం కేంద్ర ప్రభుత్వం అహంకారాన్ని పరాకాష్ట అన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ద్వారా పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు.

### కాపునాడు చక్రాయపేట మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు

**చక్రాయపేట :** మండల కాపునాడు అధ్యక్షుడిగా తనను నియమిస్తు జాతీయ కాపునాడు అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆదేశాలు జారీ చేశారని మూర్తి శ్రీనివాసులు తెలిపారు.

కాపునాడు రాయలసీమ జోన్ అధ్యక్షుడు వీరాజనేయులు సిఫారసు మేరకు తనకు మండల శాఖ అధ్యక్షుడిగా నియమించారన్నారు. కాపుల సమస్యల కోసం పోరాటం చేస్తానని చెప్పారు.